క్లుప్తంగా

శ్రీవారికి హనుమంత వాహన సేవ



శ్రీవారి సేవలో పాల్గొన్న అర్చకులు, అధికారులు, భక్తులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): స్థానిక రామచంద్రరావు పేట శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో శ్రీవారి 36వ మహా కుంభాభిషేకాల్లో భాగంగా గురువారం రాత్రి స్వామివారికి హనుమంత వాహన సేవ వైభవంగా నిర్వహించారు. ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ముఖ్య అర్చకుడు కిళాంబి మారుతీ శ్రీనివాస రామానుజాచార్యులు పర్యవేక్షణలో యాజ్ఞిక బ్రహ్మలు జీవీపీ దీక్షిత్ స్వామి, కిళాంబి వేంకట పవన్ కృష్ణమాచార్యులు విశేష పూజలు చేయగా, కార్య నిర్వహణాధికారి సతీష్ కుమార్ నల్లూరి కార్యక్రమాలను పర్యవేక్షించారు.

ఉత్సాహంగా వేసవి విజ్ఞాన తరగతులు



వేసవి తరగతుల్లో పాల్గొన్న విద్యార్థులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): జిల్లా కేంద్ర గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిక్షణ తరగతులు ఉత్సాహంగా కొనసాగుతున్నాయి. గురువారం 10వరోజు విద్యార్థులచే గ్రంథాలయ సిబ్బంది పుస్తక పఠనంలో నీతి కథలను చదివించి కథల్లోని నీతిని వివరించారు. రిసోర్స్ పర్సన్ కె.తరుణ్ ఫిజికల్ సైన్స్, న్యాచురల్ సైన్స్ అంటే ఏమిటి (ఎన్‌ఎస్) మొక్కలు, హార్మోన్‌లు, ఆహార పదార్థాలు, ఇతర అంశాలపై మాట్లాడారు. డి.శ్రీవల్లి రంగు రంగు కాగితాలతో (పేపరు క్రాఫ్టులు) గ్రీటింగ్స్ తయారు చేయడంపై శిక్షణ ఇచ్చారు. పి.శంకర్ డ్రాయింగ్‌లో శిక్షణ ఇచ్చారు. శిక్షణ కార్యక్రమాలను జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఎం శేఖర్ బాబు పర్యవేక్షించారు. డిప్యూటీ లైబ్రేరియన్ ఎ.నారాయణ రావు, అసిస్టెంట్ లైబ్రేరియన్ వీటీ సందీప్ కుమార్, ఎండీ అస్లాంపాషా పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): స్థానిక శాంతి నగర్ సబ్ స్టేషన్ పరిధి కట్టా సుబ్బారావు తోట ఫీడర్‌లో వార్షిక మరమ్మతుల నిమిత్తం శుక్రవారం ఉదయం 7 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏలూరు డివిజన్ ఈఈ కేఎం అంబేద్కర్ తెలిపారు. కట్టా సుబ్బారావు తోట, గ్జేవియర్ నగర్, శాతవాహన నగర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

పత్రికా స్వేచ్ఛను హరించవద్దు

- సాక్షి ఎడిటర్ ధనుంజయరెడ్డి ఇంటిలో సోదాలు సిగ్గుచేటు!
- ప్రభుత్వ అవినీతిని ప్రజలకు తెలిపితే ఉక్కుపాదమా?
- జిల్లా కేంద్రంలో కదంతొక్కిన జర్నలిస్టులు



డీఎస్పీకి వినతిపత్రం అందిస్తున్న ఏపీయూడబ్ల్యూజే నాయకులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): సాక్షి దినపత్రిక ఎడిటర్ ధనుంజయరెడ్డి నివాసంపై సిట్ బృందం పేరుతో గురువారం అక్రమంగా సోదాలు చేయించి భయభ్రాంతులకు గురిచేసే విధంగా చర్యలు చేపట్టడం పత్రికా స్వేచ్ఛను హరించడమేనని, ఇది ప్రజాస్వామ్యానికే మాయని మచ్చ అని, ఇటువంటి చర్య ప్రభుత్వానికి సిగ్గుచేటని ఏపీయూడబ్ల్యూజే నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ధనుంజయరెడ్డి నివాసంలో పోలీసుల సోదాలకు నిరసనగా ఏపీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో ఏలూరు డీఎస్పీ డి.శ్రావణ్ కుమార్‌ను గురువారం సాయంత్రం కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పత్రికలు, న్యూస్ చానళ్ల ప్రభుత్వానికి, ప్రజలకు అనుసంధానంగా ఉంటూ ప్రజలను చైతన్య పరిచే విధంగా నిష్పక్షపాతంగా వార్తలు ప్రచురణ / ప్రసారం చేస్తూ ఉంటాయని తెలిపారు. సమాజంలో జరిగే అవినీతిని వెలికితీసి ప్రభుత్వాన్ని అప్రమత్తం చేసే బాధ్యతను ఎటువంటి లాభాపేక్ష లేకుండా తీసుకుంటాయని, ఈ క్రమంలో కొందరు ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు పాల్పడుతున్న అవినీతి కార్యకాపాలను ప్రజలకు తెలియచేస్తుండడం సాధారణమని వివరించారు. కూటమి ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను ప్రజలకు తెలియజేస్తూ పాఠకుల ఆదరణ చూరగొంటున్న సాక్షి దినపత్రికపై కక్ష పూరితంగా వ్యవహరిస్తోందని, ఆ పత్రికను నియంత్రించేందుకు ప్రభుత్వం అక్రమ మార్గంలో పయనిస్తోందని ఆరోపించారు. ప్రభుత్వంపై వ్యతిరేక వార్తలు రాసినంత మాత్రాన పత్రికా సంపాదకులు, విలేకరులపై కక్ష పూరిత చర్యలు తీసుకోరాదని సుప్రీంకోర్టు మార్గదర్శకాలు వెలువరించిన విషయాన్ని ఈ సందర్భంగా డీఎస్పీ ఎదుట ప్రస్తావించారు. సంపాదకులపై, విలేకరులపై అక్రమ కేసులు బనాయించి వారిని నియంత్రించే విధంగా వ్యవహరిస్తున్న ప్రభుత్వ చర్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని, ఇటువంటి వ్యవహారాల్లో పోలీస్, ఇంటిలిజెన్స్ వ్యవస్థలు నిష్పక్షపాతంగా వ్యవహరించాలని నాయకులు డిమాండ్ చేశారు. డీఎస్పీకి వినతిపత్రం అందించిన వారిలో ఏపీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు కేవీకే కిషోర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కె.మాణిక్యరావు, ఏపీయూడబ్ల్యూజే ఫొటో గ్రాఫర్స్ రాష్ట్ర నాయకుడు ఎస్‌కే రియాజ్, జిల్లా ప్రధాన కార్యదర్శి టైమ్స్ కిషోర్, జిల్లా ఉపాధ్యక్షుడు ఉర్ల శ్రీనివాస్, జిల్లా జాయింట్ సెక్రటరీ సీహెచ్ రామకృష్ణరాజు, ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా ఉపాధ్యక్షుడు దేవరపు విజయ్‌కుమార్, ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా జాయింట్ సెక్రటరీ ముద్రగడ భరత్, నాయకులు ఎం రాజేష్ కుమార్, కె.శ్రీనివాస్, కె.అప్పలరాజు, గుండిమెడ రామచంద్రశర్మ, బి.రాము, కె.వంశీకుమార్, కె.వినోద్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డెక్కే పరిస్థితి తెచ్చుకోవద్దు



పాలనలో అవినీతిని ఎండగట్టడం పత్రికల ప్రధాన విధి. ఏ స్థాయి అధికారి లేదా ప్రజాప్రతినిధి అవినీతికి పాల్పడితే పత్రికలు, చానల్స్ అవినీతిని వెలికితీస్తాయి. ప్రజాప్రతినిధులు అవినీతికి దూరంగా ఉంటూ పాలన సాగించాల్సింది పోయి అవినీతి చేస్తాం, వాటిని ప్రచురించకూడదంటే కుదరదు. ప్రజాస్వామ్య వ్యవస్థలో పత్రికలకు ప్రత్యేక స్థానం ఉంది. ప్రభుత్వం ఇటువంటి చర్యల ద్వారా స్వేచ్ఛను హరించడానికి ప్రయత్నిస్తే రాష్ట్ర వ్యాప్తంగా జర్నలిస్టులు రోడ్డెక్కే పరిస్థితి ఎదురౌతుంది. ఆ పరిస్థితి తెచ్చుకోకుండా ప్రభుత్వం హుందాగా వ్యవహరించాలి.

– కాగిత మాణిక్యరావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, ఏపీయూడబ్ల్యూజే

పత్రికా స్వేచ్ఛకు గొడ్డలిపెట్టు



పత్రికా స్వేచ్ఛను హరించే హక్కు ఏ వ్యవస్థకూ లేదు. సాక్షి దినపత్రిక ఎడిటర్ ధనుంజయరెడ్డి ఇంటిపై దాడి పత్రికా స్వేచ్ఛకు గొడ్డలి పెట్టు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఇటువంటి ఘటనలు దురదృష్టకరం. పోలీస్ చర్యలతో పత్రికలను నియంత్రించాలని ప్రయత్నించడం విఫలప్రయత్నంగానే మిగిలిపోతుంది. నాలుగో ఎస్టేట్ తలచుకుంటే ప్రభుత్వాలు కూలిపోయిన ఘటనలు చరిత్రలో అనేకం ఉన్నాయనే విషయాన్ని ప్రభుత్వం గుర్తుంచుకోవాలి. లేనిపక్షంలో రాష్ట్రమంతా ఒక్కటై ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడే పరిస్థితి ఎదురౌతుంది.

– టైమ్స్ కిషోర్, జిల్లా ప్రధాన కార్యదర్శి, ఏపీయూడబ్ల్యూజే

మీడియా ఎప్పుడూ ప్రతిపక్షమే



మీడియా ఎప్పుడూ ప్రతిపక్షమే. ప్రభుత్వం అందించే సంక్షేమంలో 90 శాతం మందికి న్యాయం జరిగితే, ఆ 10 మంది సమస్యలు, బాధలు కూడా వార్తల ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చి న్యాయం చేయాలనేదే నిజమైన మీడియా లక్ష్యం. విమర్శించే వారు లేకపోతే నియంత్రించే వారిదే రాజ్యం అవుతుంది. ప్రజాస్వామ్యంలో ప్రభుత్వ విజయాలతో పాటు వ్యవస్థల వైఫల్యాలను చెప్పటం మీడియా కర్తవ్యం. మీడియా సంస్థలపై, జర్నలిస్టులపై అనుచిత చర్యలు పాల్పడటం మీడియా స్వేచ్ఛను హరించటమే.

– ముద్రగడ భరత్, ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా జాయింట్ సెక్రటరీ, ఏపీయూడబ్ల్యూజే

పహల్గాం దాడి దురదృష్టకరం



మౌనం పాటిస్తున్న వైఎంహెచ్‌ఏ సభ్యులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): జమ్మూ కాశ్మీర్‌లోని పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రదాడి దురదృష్టకరమని, ఈ దాడిలో మృతి చెందిన వారి ఆత్మలకు శాంతి చేకూరాలని నగరానికి చెందిన హిందూ యువజన సంఘం నాయకులు సంతాపం ప్రకటించారు. గురువారం స్థానిక వైఎంహెచ్‌ఏ హాలులో నిర్వహించిన సంతాప సమావేశంలో ఉగ్రవాదుల దాడిలో మృతి చెందిన వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. మృతుల ఆత్మకు శాంతి చేకూరాలని రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు. అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సభ్యులు ఉగ్రదాడిని ఖండిస్తూ, ఉగ్రదాడికి ప్రతీకారచర్యగా మన దేశం పాకిస్తాన్ ఉగ్రవాదుల స్థావరాలపై చేసిన ఆపరేషన్ సిందూర్‌ను స్వాగతిస్తున్నామని, దేశమంతా సైనికులకు అండగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో మేనేజ్మెంట్ కమిటీ అధ్యక్షుడు యర్రా సోమలింగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి కేవీ సత్యనారాయణ, గౌరవ అధ్యక్షుడు అంబికా రాజా, కోశాధికారి కానాల బాల వెంకట రమేష్, సభ్యులు ఎంవీవీఎస్ నాగేశ్వరరావు, గుడిపాటి లలిత శర్మ, లంక వెంకటేశ్వర్లు, శలా రాజాబాబు, పెదపాటి రామకృష్ణ, కె.శ్రీనివాస్, కార్యనిర్వాహక కమిటీ అధ్యక్షుడు ఇరదల ముద్దుకృష్ణ, ప్రధాన కార్యదర్శి మజ్జి సూర్యకాంతారావు, గౌరవ అధ్యక్షుడు వేణుగోపాల్ లునాని తదితరులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌జెండర్స్‌కు పథకాలు అందాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న రత్నప్రసాద్

ఏలూరు (టూటౌన్): ట్రాన్స్‌జెండర్స్ చట్టాలపై అవగాహన పొంది, ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాదు అన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ భవనంలో గురువారం ట్రాన్స్‌జెండర్స్‌కు ఏర్పాటుచేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ప్రతి ఒక్కరికీ చట్టాలపైన అవగాహన కలిగించాల్సిన బాధ్యత న్యాయ సేవాధికార సంస్థలపై ఉందన్నారు. అందులో భాగంగానే ట్రాంజెండర్స్‌కు సదస్సు ఏర్పాటుచేశామని చెప్పారు. స్త్రీ, పురుషులతో సమానంగా ట్రాన్స్‌జెండర్స్‌కు కూడా సమాన హక్కులు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందని, అందరితో సమానంగా సంక్షేమ పథకాలను అందించాలని, రక్షణ కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో విభిన్న ప్రతిభావంతుల అదనపు డైరెక్టర్ బి.రామ్ కుమార్, చీఫ్ లీగల్ ఎయిడ్ కౌన్సిల్ పీఎన్‌వీ మునీశ్వరరావు, మాస్టర్ ట్రైనరు పి.రత్నరాజు, పెద్ద సంఖ్యలో ట్రాన్స్ జెండర్స్, తదితరులు పాల్గొన్నారు.

సమ్మెను విజయవంతం చేద్దాం



ఐక్యతను చాటుతున్న నాయకులు

ఏలూరు (టూటౌన్): కార్మిక హక్కులను హరిస్తోన్న కేంద్ర ప్రభుత్వ వైఖరిని కార్మిక సంఘాల నాయకులు తీవ్రంగా వ్యతిరేకించారు. ఈనెల 20న సార్వత్రిక సమ్మె సన్నాహక సదస్సు గురువారం సీపీఐ స్థానిక కార్యాలయంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు రెడ్డి శ్రీనివాస్ డాంగే, సీఐటీయూ జిల్లా అధ్యక్షులు ఆర్ లింగరాజు, ఐఎఫ్‌టీయూ ఉమ్మడి జిల్లా కార్యదర్శి బద్దా వెంకట్రావు అధ్యక్షతన నిర్వహించారు. సదస్సులో సీఐటీయూ జిల్లా కార్యదర్శి డీఎన్‌వీడీ ప్రసాద్, ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షులు బండి వెంకటేశ్వరరావు, ఐఎఫ్‌టీయూ జిల్లా ఉపాధ్యక్షులు ఎస్ రామ్మోహన్‌రావులు మాట్లాడారు. కేంద్రం ఉద్యోగ కార్మిక వ్యతిరేక విధానాలను తక్షణమే విడనాడాలి డిమాండ్ చేశారు. 20న సమ్మె సందర్భంగా పట్టణ, మండల కేంద్రాలతో పాటు జిల్లా కేంద్రంలో వందల మంది ఉద్యోగ, కార్మికులతో ప్రదర్శన, సభలు నిర్వహించాలని నాయకులు పిలుపునిచ్చారు. తొలుత కాశ్మీరులో ఉగ్రదాడిలో మరణించిన దేశ పౌరులకు సంతాపం తెలిపారు. సదస్సుకు ఏఐటీయూసీ జిల్లా సహాయ కార్యదర్శి ఎ.అప్పలరాజు స్వాగతం పలకగా, సీఐటీయూ నాయకులు జె.గోపి వందన సమర్పణ చేశారు.

ప్రేమించి మోసం చేసిన డాక్టర్ అరెస్ట్

ఏలూరు టౌన్: ఏలూరులోని ఒక ప్రైవేటు మెడికల్ కాలేజీలో వైద్య విద్య పూర్తి చేసిన డాక్టర్ ను ప్రేమపేరుతో మోసం చేసి మరో యువతిని పెళ్లి చేసుకునేందుకు సిద్ధపడిన డాక్టర్ ను ఏలూరు మహిళా పోలీస్ స్టేషన్ సీఐ ఎం సుబ్బారావు అరెస్టు చేశారు. ప్రేమించి పెళ్లిచేసుకుంటానని అబార్షన్లు చేయించి ఆపై పెళ్లికి నిరాకరించి, మరో యువతిని పెళ్లి చేసుకోవడానికి పీటలపై కూర్చోడానికి సిద్ధపడిన ఒక డాక్టర్ని ఏలూరు మహిళా పోలీస్ అధికారులు గురువారం అరెస్టు చేశారు. ఏలూరు శివారులోని ఒక ప్రైవేటు మెడికల్ కళాశాలలో ఒక యువతి డాక్టర్ చదివింది. ఈనెల 4న పరీక్షలు పూర్తి చేసుకుంది. ఆమెతో పాటే పల్నాడు జిల్లా రాజుపాలెం మండలం శ్రీనివాసనగర్కు చెందిన భవనం రమణారెడ్డి రేడియోలజీ చదివారు. వారిద్దరూ వైద్యవిద్య అభ్యసిస్తూ ప్రేమించుకున్నారు. పెళ్లి చేసుకుంటానని యువతిని నమ్మించి వివాహేతర సంబంధం కొనసాగించారు. అబార్షన్లు కూడా చేయించారు. అనంతరం పెళ్లికి నిరాకరించి మరో యువతిని ఈనెల 11న పెళ్లి చేసుకోవడానికి సిద్ధపడ్డాడు. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు డాక్టర్ భవనం రమణారెడ్డిని అరెస్ట్ చేసి, కేసు దర్యాప్తు చేపట్టామని సీఐ ఎం సుబ్బారావు గురువారం తెలిపారు.

విద్యార్థిని ఆత్మహత్యా యత్నం

ఏలూరు టౌన్: వారు ఐదేళ్ల పాటు ప్రేమించుకున్నారుం. గత రెండు నెలలుగా విద్యార్థినికి ముఖం చాటేశాడుం. పెళ్లి చేసుకుంటానని నమ్మించి లోబర్చుకుని మోసం చేశాడని తీవ్ర మనస్తాపానికి గురైన విద్యార్థిని ఆత్మహత్యా యత్నానికి పాల్పడింది. డిగ్రీ రెండో సంవత్సరం చదువుతున్న ఆమె ప్రస్తుతం ఏలూరు సర్వజన ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. ఈనెల 7న రాత్రి ఈ ఘటన చోటుచేసుకుంది. బాధితురాలి తల్లిదండ్రులు శివనాగ రాజు, కనకమహాలక్ష్మిలు తెలిపిన వివరాల ప్రకారం.. 'మా కుమార్తె డిగ్రీ సెకండ్ ఇయర్ చదువుతోంది. ఏలూరుకు చెందిన గెడ్డెం సంతోష్ కుమార్ అనే యువకుడు ప్రేమపేరుతో మా కుమార్తెను మోసగించాడు. ఐదేళ్లుగా ప్రేమిస్తున్నానంటూ వెంటపడ్డాడని, ఇప్పుడు పెళ్లికి నిరాకరించడంతో మా కుమార్తె పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. నిందితుడిపై కఠిన చర్యలు తీసుకోవాలి. మా కుమార్తెకు న్యాయం చేయాల'ని కోరారు. ఇదిలా ఉండగా ఈ విషయంపై కొందరు ప్రజాప్రతినిధులు రాజీ చేసుకోవాలని ఒత్తిడి చేయటంతో పోలీసులు ఉదాసీనత వ్యవహరిస్తున్నారని బాధితులు ఆరోపిస్తున్నారు.

ప్రేమ పేరుతో మోసం

ఏలూరు టౌన్: ప్రేమ పేరుతో ఒక యువతి మోసగించిన యువకునితో పాటు, అతని తల్లిదండ్రులపైనా ఏలూరు మహిళా పోలీసులు కేసు నమోదు చేశారు. ం ఏలూరు జిల్లాకు చెందిన యువతిని గుంటూరు జిల్లా తాడేపల్లికి చెందిన సాధు వెంకట అక్షయ్ ప్రేమించాడు. పెళ్లి చేసుకుంటానని నమ్మించి వివాహేతర సంబంధం కొనసాగించాడు. ఆమెను పెళ్లి చేసుకుంటానని అతని తల్లి ఇందిర రాణి, తండ్రి నరసింహుడు కలిసి సంబంధం మాట్లాడుకున్నారు. అనంతరం పెళ్లికి నిరాకరించారు. బాధితురాలు ఫిర్యాదు మేరకు మహిళా పోలీస్ స్టేషన్లో కేసు నమోదైంది.

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	18	అరటి కాయ (1)	06-08
వంకాయలు (గులాబీ)	30	చిక్కుడు కాయలు	80
వంకాయలు (కాంతులు)	40	బీక్లచిక్కుడు	--
వంకాయలు (తెలుపు)	38	చామదుంపలు	54
బెండకాయలు	30	ములక్కాడలు	08, 10
పచ్చిమిర్చి	30	కంద	--
కాకర కాయలు	30-38	బీట్‌రూట్	34
బీరకాయలు	30	కీరా దోస	36
బీరకాయలు (పందిరి)	40	ఫ్రెంచ్‌బీన్స్	70
క్యాబేజీ	20	అల్లం	60
క్యారెట్	38	కొత్తిమీర (కట్ట)	25
దొండకాయలు	24	పాలకూర	12
బంగాళదుంపలు	30	తోటకూర	10
ఉల్లిపాయలు	24	చుక్కకూర	12
గోరుచిక్కుడు	38	గోంగూర	07-10
దోసకాయలు	22	పుదీనా	05
ఆనబకాయ (1)	10-15	క్యాప్సికమ్	70
పొట్లకాయ(1)	20	చిలకడదుంప	40

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (ఇంద్ర)	21.00	19
ఏలూరు - జీడిమెట్ల (ఈసీఐఎల్) (ఇంద్ర)	21.30	24
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	28
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ (స్టార్ లైనర్ నాన్‌ఏసీ స్లీపర్)	22.30	14

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.45	4820	20
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.15	4822	20
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	25
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	10.45	4798	14
ఏలూరు - జీడిమెట్ల వయా ఖమ్మం	21.15	4802	20
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	17
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	19
ఏలూరు - తిరుపతి	16.00	4830	32

సమన్వయంతో పనిచేయాలి

ఏలూరు(మెట్రో): దెందులూరు నియోజకవర్గ అభివృద్ధికి సమన్వయంతో పనిచేయాలని ఎంపీ పుట్టా మహేష్ కుమార్, ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్‌లు అధికారులకు దిశా నిర్దేశం చేశారు. గురువారం స్థానిక కలెక్టరేట్ గౌతమీ సమావేశ మందిరంలో నిర్వహించిన దెందులూరు నియోజకవర్గ సమీక్షా సమావేశంలో ఎంపీ, ఎమ్మెల్యే, కలెక్టర్ కె.వెట్రిసెల్వి, జేసీ పి.ధాత్రిరెడ్డి పాల్గొన్నారు. వ్యవసాయ, ఉద్యాన, ఇరిగేషన్, పశుసంవర్ధక శాఖ, పీఆర్, ఆర్‌అండ్‌బీ, విద్యుత్, రెవెన్యూ, తదితర శాఖల అధికారులతో సుదీర్ఘ సమీక్ష నిర్వహించారు. ప్రజా ప్రతినిధులు లేవనెత్తిన వివిధ అంశాలపై తగు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు.

యాక్సిస్ ఒప్పందాన్ని రద్దు చేయాలి

ఏలూరు (టూటౌన్): యాక్సిస్ ఒప్పందాన్ని రద్దు చేయాలని ఆంధ్రప్రదేశ్ చేతి వృత్తిదారుల సమన్వయ కమిటీ ఏలూరు జిల్లా కమిటీ కన్వీనర్ పిచ్చుక ఆదిశేషు, కో కన్వీనర్ ఆగోళ్ల వెంకట కృష్ణారావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్ర ప్రజలపై 25 ఏళ్లపాటు రూ.15 వేల కోట్లు భారం వేసే ఒప్పందానికి విద్యుత్తు రెగ్యులేటరీ కమిషన్ ఆమోదం తెలపడం అన్యాయమని పేర్కొన్నారు. యాక్సిస్ ఎనర్జీ వెంచర్స్ నుంచి విద్యుత్ యూనిట్ రూ.4.60 చొప్పున కొనుగోలుకు ఏపీఎస్ పీడీసీఎల్ చేసుకున్న ఒప్పందాన్ని ఆమోదిస్తూ ఏపీఈఆర్‌సీఆర్ ఇటీవల జారీ చేసిన ఉత్తర్వులను ప్రస్తావించారు.

శ్రీవారి క్షేత్రంలో భారీగా ఉపనయనాలు, వివాహాలు

ద్వారకాతిరుమల: శ్రీవారి క్షేత్రంలో గురువారం ఉపనయనాలు, వివాహాలు భారీగా జరిగాయి. మంచి ముహూర్తం కావడంతో అనివేటి మండప ప్రాంతం, కొండపైన దేవస్థానం కల్యాణ మండపాల్లో ఈ వేడుకలు అట్టహాసంగా నిర్వహించారు. శుభముహూర్త సమయంలో వటువులకు శాస్త్రోక్తంగా యజ్ఞోపవీత ధారణ చేశారు. స్వామివారి పాత కల్యాణమండప ప్రాంతం, ప్రైవేట్ పంక్షన్ హాళ్లలో వివాహాలు పెద్ద ఎత్తున నిర్వహించారు. వేడుకలు పూర్తయిన తర్వాత వటువులు, అలాగే పెళ్లి బృందాలు స్వామి, అమ్మవార్లను దర్శించి, ప్రత్యేక పూజలు చేశారు. క్షేత్ర పరిసరాలు సందడిగా మారాయి.

అడవుల పరిరక్షణకు అవగాహన కల్పించాలి



అటవీ అధికారికి వినతి పత్రం అందిస్తున్న బంజారా నాయకులు

ఏలూరు (టూటౌన్): అడవుల పరిరక్షణకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని కోరుతూ బంజారా భజరంగీ భేరి సంఘం నాయకులు జిల్లా అటవీ అధికారికి గురువారం వినతి పత్రం అందజేశారు. అడవులను కొందరు దుండగులు తగలబెట్టడం, నరికి వేయడం వల్ల అంతరించిపోతున్నాయని, దీంతో జీవ సమతుల్యత దెబ్బతింటుందని పేర్కొన్నారు. అడవుల పరిరక్షణకు గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లో అవగాహన సదస్సులు ఏర్పాటు చేయాలని, అడవులను పెంచడానికి వర్షాకాలంలో బంజారా భజరంగి భేరి సంఘానికి అటవీ శాఖ నుంచి విత్తనాలు, మొక్కలు ఇవ్వాలని కోరారు. వీటిపై అటవీ శాఖ జిల్లా అధికారి సానుకూలంగా స్పందించారని నాయకులు భూక్యా నాగరాజు నాయక్, జరభల వెంకట కృష్ణ ప్రసాద్ తెలిపారు.

ప్రహరీ కూల్చివేతను ఖండించిన దళిత సంఘాలు



కలెక్టరేట్ వద్ద మాట్లాడుతున్న ఎంఆర్‌పీఎస్ నాయకులు

ఏలూరు (టూటౌన్): భీమడోలులో కొత్తపల్లి చంద్రమౌళికి చెందిన ప్రహరీ కూల్చివేతను ఎంఆర్‌పీఎస్ నాయకులు ఖండించారు. ఈ మేరకు కలెక్టర్, ఎస్పీ, డీఎస్పీ, డీపీఓ కార్యాలయాల్లో వినతి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎంఆర్‌పీఎస్ నాయకులు బయ్యారపు రాజేశ్వరరావు మాట్లాడుతూ భీమడోలు గ్రామానికి చెందిన దళిత సామాజిక వర్గానికి చెందిన కొత్తపల్లి చంద్రమౌళి ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్‌కు, లోకాయుక్త కోర్టుకు ఫిర్యాదు చేశాడని చెప్పారు. ఈలోగా పంచాయతీ ఉద్దేశపూర్వకంగా చంద్రమౌళికి ముందస్తు సమాచారం ఇవ్వకుండా జేసీబీ, ట్రాక్టర్‌తో వెళ్లి ఇంటి ప్రహరీ కూల్చి విధ్వంసం సృష్టించిన తీరును ఖండిస్తున్నామని తెలిపారు. పంచాయతీలను నకిలీ బిల్లులతో దోపిడీ చేసే ఇటువంటి ఉద్యోగులను డిస్మిస్ చేయాలన్నారు. జిల్లా అధికారులను కలిసిన వారిలో ఎంఆర్‌పీఎస్ నాయకులు కందుల రమేష్, కాశీ కృష్ణ, కొత్తపల్లి మురళీ, తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు ఎస్పీ అభినందనలు



విద్యార్థినిని అభినందిస్తున్న ఎస్పీ ప్రతాప్ శివ కిషోర్

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఏలూరు జిల్లా పోలీస్ యాజమాన్య పర్యవేక్షణలో నడుస్తోన్న శ్రీ సురేష్ చంద్ర బహుగుణ ఇంగ్లిష్ మీడియం స్కూల్‌లో 10వ తరగతి ఫలితాల్లో అత్యుత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులను ఎస్పీ కె.ప్రతాప్ శివకిషోర్ గురువారం అభినందించారు. స్థానిక ఎస్పీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులను దుశ్శాలువాలతో సత్కరించి, సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ 10వ తరగతి పరీక్షల్లో అంకెం ఈశ్వరి లక్ష్మి 572 మార్కులతో ప్రథమ, ఇనపూడి బాల సాగర్ (562)ద్వితీయ, పామర్తి నవ్య (562) ద్వితీయ, షేక్ యూసుఫ్ యోహానా (551) తృతీయ స్థానాల్లో నిలవడం శుభపరిణామమని అన్నారు. చదువులో 20 సంవత్సరాల పాటు కృషి చేస్తే, మిగతా 80 సంవత్సరాలు సుఖ సంతోషాలతో గడిపే అవకాశం ఉంటుందని, ప్రతి విద్యార్థి తల్లిదండ్రుల ఆశయ సాధనకు శ్రమించాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ (అడ్మిన్) ఎన్ సూర్య చంద్రరావు, స్కూల్ ప్రిన్సిపాల్ స్రవంతి, ఆర్‌ఎస్‌ఐ నరేంద్ర, వైస్ ప్రిన్సిపాల్ వర ప్రసాద్ సాయిరాం, పాఠశాల అధ్యాపకులు పాల్గొన్నారు.